www.prajasakti.com
# ప్రజాశక్తి
శుక్రవారం 25 జులై 2025
5
వైఎస్ఆర్

## ఉపకార వేతనాలకు దరఖాస్తుల ఆహ్వానం
**ప్రజాశక్తి - కడప అర్బన్**
జిల్లాలోని వివిధ పాఠశాలలు, కళాశాలలో చదువుతున్న విభిన్న ప్రతిభావంతులైన విద్యార్థుల నుంచి జాతీయ ప్రీ మెట్రిక్ (9,10 తరగతులు) పోస్ట్ మెట్రిక్ (ఇంటర్ మీడియట్, ఆ పై చదువులు) చదివే విద్యార్థుల నుంచి ఉపకార వేతనాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నారని విభిన్న ప్రతిభావంతుల శాఖ ఏడీ ఆర్.వి.కృష్ణ కిషోర్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అర్హత కలిగిన విద్యార్థులు https://scholarships.gov.in వెబ్ సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. ప్రీ మెట్రిక్ దరఖాస్తుకు ఆగస్టు 31 వరకు, పోస్ట్ మెట్రిక్ దరఖాస్తుకు అక్టోబర్ 31 వరకు అవకాశం ఉందని పేర్కొన్నారు. జిల్లాలోని విభిన్న ప్రతిభావంతులైన విద్యార్థులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

## సున్నపురాళ్లపల్లెలో జెఎస్‌డబ్ల్యు సోలార్ ప్రాజెక్టు
### రూ.2.91 కోట్లతో గండికోట లిఫ్ట్ ఇరిగేషన్ బిల్డింగ్
### మైదుకూరులో ఐదెకరాల్లో వేర్‌హౌసింగ్ నిర్మాణం
### మంత్రి వర్గ సమావేశంలో ఆమోదం

**ప్రజాశక్తి - కడప ప్రతినిధి**
జమ్మలమడుగు నియోజకవర్గంలోని సున్నపురాళ్లపల్లెలో జెఎస్‌డబ్ల్యు సోలార్ ప్రాజెక్ట్ ఏర్పాటుకు రాష్ట్ర కేబినెట్ ఆమోదం తెలిపింది. గురువారం రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అధ్యక్షతన ఇ-కెబినెట్ సమావేశం నిర్వహించారు. సున్నపురాళ్లపల్లె సమీప గ్రామాల్లో 1050 మెగా వాట్ల సోలార్ పవర్ ప్రాజెక్ట్ సామర్థ్యంలో భాగంగా 450 మెగావాట్లతో పరిశ్రమ ఏర్పాటుకు జెఎస్‌డబ్ల్యు నియో ఎనర్జీ లిమిటెడ్ ప్రతిపాదనకు ఆమోదం తెలిపింది. జిల్లాలోని జమ్మలమడుగు, మైదుకూరు, కమలాపురం నియోజ కవర్గాల పరిధిలో పలు అభివృద్ధి పనులకు ఆమోదం తెలిపింది. రాష్ట్రంలో పరిశ్రమల శాఖ తరుపున పలు క్లస్టర్లలో ఎలక్ట్రానిక్ విడిభాగాల పరిశ్రమలకు ప్రోత్సాహకాలు, సబ్సిడీలకు మొగ్గు చూపిన కారణంగా కడప నగర శివారులోని కొప్పర్తి పారిశ్రామికవాడలో యువతకు ఉపాధి అవకాశాలు పెరిగే అవకాశాలు ఉన్నట్లు తెలిపింది. 2023-24 సంవత్సరంలో ఎపిఐ అంచనాల, పరిపా లనా, 2022-23 ఎస్ఎస్ఆర్ ధరల ప్రకారం రూ.2.91 కోట్లతో గండికోట లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు స్టేజ్-1, స్టేజ్-2 భవన నిర్మాణాలకు ఆమోదం తెలిపింది. మైదుకూరులో ఐదు ఎకరాల విస్తీర్ణంలో నేషనల్ అగ్రికల్చరల్ కో-ఆపరేటివ్ మార్కెటింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (నాఫెడ్) మంజూరు చేయడానికి అనుకూలంగా రూ.21.08 లక్షల భూమి విలువ చెల్లింపుల్లో భాగంగా ప్రభుత్వ భూమి అప్పగింత ప్రతిపాదనకు ఆమోదం తెలిపింది.

## ప్రతి మండలంలోనూ మోడల్ కిచెన్‌లు : కలెక్టర్
**ప్రజాశక్తి -చింతకొమ్మదిన్నె**
రాష్ట్రంలో పైలెట్ ప్రాజెక్టు కింద ఏర్పాటు చేస్తున్న ఆటోమేషన్ కిచెన్ (మోడల్ కిచెన్)లను జిల్లాలోని అన్ని మండలాల్లో ఏర్పాటు చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ డాక్టర్ చెరుకూరి శ్రీధర్ పేర్కొన్నారు. గురువారం మండల పరిధిలోని జిల్లా పరిషత్ ఉన్నతపాఠశాల, జె. కొత్తపల్లె ఉన్నత పాఠశాలలలో చేపడుతున్న సెంట్రలైజ్డ్ ఆటోమేషన్ కిచెన్ హాల్ నిర్మాణ పనులను కలెక్టర్ పరిశీలించారు. పాఠశాలలలో సెంట్రలైజ్డ్ ఆటోమేషన్ ఆఫ్ కిచెన్స్ భవన నిర్మాణ పనులను పరిశీలించి సంబంధిత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, వంట నిర్వాహకులతో మాట్లాడారు. ప్రస్తుతం నిర్వహణలో ఉన్న డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజనం నిర్వాహణ ఎలా సాగుతోందని అడిగారు. ఇంజినీరింగ్ అధికారులకు మోడల్ కిచెన్ నిర్మాణ పనులపై పలు సూచనలు ఇచ్చారు. సెంట్రలైజ్డ్ స్మార్ట్ కిచెన్ హాలు నిర్మాణ పనుల్లో వినియోగిస్తున్న మెటీరియల్, పరిసరాలను క్షుణ్ణంగా పరిశీలించిన కలెక్టర్ సంబందిత అధికా రులకు పలు సూచనలు,ఆదేశాలు జారీ చేశారు. రాష్ట్రానికే ఆదర్శంగా జిల్లాలో నిర్మిస్తున్న సెంట్రలైజ్డ్ స్మార్ట్ కిచెన్ హాళ్లను, జిల్లాలోని అన్ని మండలాల్లో ఏర్పాటు చేసేందుకు చర్యలు చేపట్టాలని సంబందిత అధికారులను ఆదేశించారు. ఇప్పటికే జిల్లా కేంద్రంలోని కడప మున్సిపల్ మెయిన్స్ హైస్కూలులో ఏర్పాటు చేసిన సెంట్రలైజ్డ్ మోడల్ కిచెన్ ద్వారా నగర పరిధిలోని పలు పాఠశాలలకు సరైన సమయంలో డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజనం సరఫరా చేస్తామని చెప్పారు. ఆయన వెంట కడప ఆర్‌డిఒ జాన్ ఇర్విన్, ఆగ్రోస్ డిఎం, సెంట్రలైజ్డ్ స్మార్ట్ కిచెన్స్ నోడల్ అధికారి జోయల్ విజయ్ కుమార్, హౌసింగ్ పీడీ రాజా రత్నం, తహశీల్దార్ నాగేశ్వరరావు, డిఇఒ శంశుద్దిన్, ఎపిఎస్‌పిడిసిఎల్, ఆర్‌డ బ్ల్యుఎస్, పిఆర్, ఎస్ఎస్ఎ సంబంధిత ఇంజినీరింగ్ అధికారులు, ఎంఇఒలు సుజాత, రమాదేవి,ఆయా పాఠశాలల హెచ్ఎం, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

అధికారులకు సూచనలిస్తున్న కలెక్టర్

### పి-4పై అధికారులు దృష్టి సారించాలి
**కడప :** జిల్లాలో ప్రజలు, ప్రభుత్వం, దాతల భాగస్వామ్యంతో కూడిన పి-4 పథకానికి సంబంధించి నిర్దేశించిన మార్గదర్శకాల ప్రకారం బంగారు కుటుంబాల మ్యాపింగ్ ప్రక్రియను అధికారులు ప్రత్యేక శ్రద్ధతో అమలు చేయాలని కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి అధికారులకు సూచించారు. గురువారం రాష్ట్ర రాజధాని అమరావతి నుంచి అన్ని జిల్లాల కలెక్టర్లు, సంబంధిత శాఖల అధికారులతో పలు అంశాలపై రాష్ట్ర ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి విజయానంద్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షా సమావేశం నిర్వహించారు. స్థానిక కలెక్టరేట్ బోర్డు మీటింగ్ హాలు జెసి అదితిసింగ్‌తో కలసి కలెక్టర్ హాజరయ్యారు. విసి అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలు సేవలు అందించడంలో ప్రజల నుంచి సానుకూలత పెరిగేలా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాలో ప్రభుత్వ సేవలు సంతృప్త స్థాయిలో ప్రజలకు అందేలా అన్ని శాఖల జిల్లా అధికారులు క్షేత్రస్థాయిలో ప్రత్యేక పర్యవేక్షణ చేయాలన్నారు.రాష్ట్ర ప్రభుత్వం ప్రాధాన్యతతో అమలు చేస్తున్న జీరో పావర్టీ, పి-4పాలసీ, బంగారుకుటుంబాలు, మార్గదర్శులు, గ్రామ సభలు, జనాభా నిర్వహణ వంటి అంశాలపై అధికారులు దృష్టి సారించాలని సూచించారు.

## ముగ్గురాయి అక్రమ మైనింగ్‌ను అరికట్టండి
### - సిఎంకు విన్నవించిన ఎమ్మెల్సీ రాంగోపాల్‌రెడ్డి
**ప్రజాశక్తి - పులివెందుల టౌన్**

ముగ్గురాయి అక్రమమైనింగ్‌పై వివరిస్తున్న ఎమ్మెల్సీ

పులివెందుల నియోజకవర్గంలో ముగ్గు రాయి అక్రమ మైనింగ్ విచ్చలవిడిగా సాగుతోందని, వెంటనే అరికట్టాలని ముఖ్య మంత్రి చంద్రబాబు నాయుడుకు ఎమ్మెల్సీ రాంగోపాల్ రెడ్డి విన్నవించారు. గురువారం అమ రావతిలోని సచివాలయంలో ముఖ్యమంత్రిని కలిసి అక్రమ మైనింగ్ పై వివరి ంచారు. ప్రభుత్వానికి పైసా కట్టకుండా కోట్లు కొల్లగొడుతున్నారని చెప్పారు. ఎన్‌సిఎల్‌టి అధీనంలో ఉన్న రూ. 10 కోట్ల విలువచేసే ముగ్గురాయిని రాత్రికి రాత్రే దొంగలించారని పేర్కొన్నారు. కొంతమంది అధికారులు అక్రమార్కులకు అండగానిలిచి దోపిడీలో భాగస్వాములయ్యారని ఫిర్యాదు చేశారు. అక్రమాలకు అడ్డుకట్ట వేయకపోతే ప్రభుత్వానికి చెడ్డపేరు వస్తుందని తెలిపారు.

## దూదేకుల ఫైనాన్స్ కార్పొరేషన్ ఏర్పాటుపై హర్షం
**ప్రజాశక్తి-కడప ప్రతినిధి**
ప్రభుత్వం ఎపి రాష్ట్ర నూర్‌బాషా, దూదేకుల ఫైనాన్స్ కార్పొరేషన్ ఏర్పాటు చేయడంపై ఎపి నూర్‌బాషా, దూదేకుల సంక్షేమ సంఘం జాతీయ ఉపాధ్యక్షులు ఖాదర్‌బాషా, రాష్ట్ర ఉపాధ్యక్షులు గగ్గుటూరు రాజా(గోల్డ్), పగిడాల ఓబులేస్, టిడిపి జిల్లా అధికార ప్రతినిధి మన్నూరు అక్బర్ గురువారం విడుదల చేసిన వేర్వేరు ప్రకటనల్లో హర్షం వ్యక్తం చేశారు. 2024 సార్వత్రిక ఎన్నికల ప్రచార మేనిఫెస్టోలో దూదేకులకు ఇచ్చిన హామీ అమలులో భాగంగా దూదేకుల ఫైనాన్స్ కార్పొరేషన్ ఏర్పాటు చేస్తామన్న హామీలో కూటమి సర్కారు మొదటి అడుగు వేసిందని తెలిపారు. కార్పొరేషన్ స్వయం ప్రతిపత్తిని కల్పించడానికి అవసరమైన రూ.వెయ్యి కోట్లు కేటాయింపులు చేయాలనే హామీని నిలుపుకుని ఫలప్రదం చేయాల్సిన అవసరం ఉందని తెలిపారు.

## పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలి
**ప్రజాశక్తి - కడప అర్బన్**
కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన మెమో 57ను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే అమలు చేసి 2003లో డిఎస్‌సి చేసిన వారికి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని రాష్ట్ర సచివాలయంలో ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్, రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్‌ను ఉపాధ్యాయ సంఘాల సమన్వయ వేదిక రాష్ట్ర గౌరవ అధ్యక్షులు ఒంటేరు శ్రీనివాసుల రెడ్డి, ఎపి సిపిఎస్ఈఏ రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శి ఎస్.ఆర్. వెంకట జనార్ధన రెడ్డి కోరారు. గురువారం 2003 డిఎస్‌సి ఫోరం సభ్యులతో కలిసి వినతి పత్రం సమర్పించారు. కార్యక్రమంలో 2003 డిఎస్‌పి ఫోరం రాష్ట్ర కార్యదర్శి ఉమ్మడి రవీంద్ర రెడ్డి, జిల్లా కన్వీనర్లు కురుకుటి సుధాకర్, రిజ్వానలి ప్రొద్దుటూరు నియోజకవర్గం బాధ్యులు అచ్చుకట్ల చాంద్ బాషా, అనంతపురం జిల్లా కన్వీనర్ గజ్జల ప్రభాకర్, ప్రకాశం జిల్లా కన్వీనర్ సుబ్బారెడ్డి పాల్గొన్నారు.

జడ్‌పి చైర్మన్‌కు వినతి పత్రం సమర్పిస్తున్న నాయకులు

## పిఎఫ్ ప్రీమియం వెంటనే జమచేయాలి
**ప్రజాశక్తి- కడప అర్బన్**
. ఉద్యోగ, ఉపాధ్యాయుల పిఎఫ్ ప్రీమియం వెంటనే అకౌంట్‌లో జమ చేయాలని పిఎస్‌టియు, వైఎస్ఆర్‌టిఎ నాయకులు జడ్‌పి చైర్మన్ రామ గోవింద్ రెడ్డికి వినతిపత్రం ద్వారా కోరారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఉద్యోగ, ఉపాధ్యాయులకు 2022 జనవరి ప్రీమియం ఇంత వరకు జమ చేయలేదని, వెంటనే జమ చేయాలని విజ్ఞప్తి చేశారు. స్పందించిన జడ్‌పి చైర్మన్ ప్రావిడెంట్ ఫండ్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్స్ నాగిరెడ్డి, విజయ భాస్కర్‌రెడ్డిని పిలిపించి 2022 జనవరి జనవరి నెల ప్రీమియాన్ని వెంటనే ఉద్యోగ ఉపాధ్యాయుల అకౌంట్‌కు జమ చేయాలని ఆదేశించారు. అనంతరం జడ్‌పి చైర్మన్‌ను వారు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో వైఎస్ఆర్‌టిఎ నాయకులు లెక్కల జమాల్ రెడ్డి, సజ్జల రమణారెడ్డి, వెంకట్‌నాథ్ రెడ్డి, రమేష్, అమర్నాథరెడ్డి, వెంకటేశ్వర్ రెడ్డి , కిరణ్ కుమార్ రెడ్డి పాల్గొన్నారు.

## డ్రగ్స్ వినియోగం మానవాళికి పెను ప్రమాదం
**ప్రజాశక్తి - పులివెందుల రూరల్**
మత్తు పదార్థాల వాడకం మానవాళి మనుగడకి పెను ప్రమాదమని ప్రొహిబిషన్, ఎక్సైజ్ సిఐ చెన్నారెడ్డి పేర్కొన్నారు. స్నేహిత అమృత హస్తం సేవాసమితి ఆధ్వర్యంలో మత్తు పదార్థాల నివారణపై గురువారం స్థానిక ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ శ్రీనివాసులు అధ్యక్షతన అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐ చెన్నారెడ్డి మాట్లాడుతూ సమాజంలో ప్రజా జీవన శైలిలో ఎన్నో మార్పులు చేరువయ్యాయని, అందులో మంచి కంటే చెడు ప్రభావం ఎక్కువ అవుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. వీటిని ఎక్కడికక్కడ అరికట్టాలంటే ప్రజా సహకారం తప్పనిసరి అన్నారు. ప్రజల సహకారంతో మత్తు పదార్థాలు నివారణ సులువు అవుతుందని పేర్కొన్నారు. అనంతరం మాదక ద్రవ్యాల నివారణ పోస్టర్ ప్రిన్సిపల్ శ్రీనివాసులు, సిఐ చెన్నారెడ్డి, డాక్టర్ శరణ్య, స్నేహిత అమృత హస్తం సేవాసమితి అధ్యక్షులు రాజు ఆవిష్కరించారు. ప్రముఖ గైనకాలజిస్ట్ డాక్టర్ శరణ్య మాట్లాడుతూ పలు సూచనలు చేశారు. ప్రిన్సిపల్ శ్రీనివాసులు మాట్లాడుతూ మాదక ద్రవ్యాలను అరికట్టే బృహత్కార్యంలో విద్యార్థుల పాత్ర కీలకమన్నారు. స్నేహిత అమృత హస్తం సేవాసమితి అధ్యక్షులు రాజు మాట్లాడుతూ మాదక ద్రవ్యాల నివారణ చర్యల్లో ప్రతి ఒక్కరూ. భాగస్వాములు కావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ గణేష్, ఎన్ఎస్ఎస్ కో-ఆర్డినేటర్ నాగేంద్రమ్మ, అనిత ఈగల్ క్లబ్ కో-ఆర్డినేటర్లు అనిత, షీలా, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## స్మార్ట్ మీటర్ల బిగింపును ఆపకపోతే ఉద్యమం
### - జిల్లాలో బలవంతపు భూసేకరణ ఆపాలి
### -సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కె.ప్రభాకర్‌రెడ్డి
**ప్రజాశక్తి - కడప అర్బన్**
రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం విద్యుత్ ఛార్జీల భారాన్ని తక్షణమే ఆపకపోతే పెద్ద ఎత్తున ప్రజా ఉద్యమాన్ని నిర్మిస్తామని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు కె.ప్రభాకర్ రెడ్డి ప్రభుత్వాన్ని హెచ్చరించారు. గురువారం సిపిఎం జిల్లా కార్యాలయంలో జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు బి. మనోహర్ అధ్యక్షతన విస్తృత సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ విద్యుత్ ఛార్జీలు పెంచడం లేదంటూనే వినియోగదారుల జేబులకు కత్తెరవేసే టైం ఆఫ్ డే టారిఫ్ విధానాన్ని చిరు వ్యాపారులకు సైతం అమలు చేయడాన్ని ప్రకటించడం దారుణమని తీవ్రంగా విమర్శించారు. రోజు వారీ డిమాండ్‌ను బట్టి ఛార్జీలు విధించే ఈ విధానాన్ని రాష్ట్రంలో విస్తృతంగా అమలు చేయడానికి ఈఆర్‌సి అనుమతించడం దారుణమని పేర్కొన్నారు. సోలార్ విద్యుత్తు యూనిట్ రూ.1.99 కు టెండర్లు పాడిన రోజుల్లో సెకితో రూ.2.49 లకు కొంటామని ఒప్పందం చేసుకోవడం సరైంది కాదన్నారు. సెకితో ఒప్పందం రద్దు చేయాలని తొలి నుంచి సిపిఎం వ్యతిరేకిస్తున్నదన్నారు. సెకితో ఒప్పందం వల్ల 25 ఏళ్ల పాటు రాష్ట్ర ప్రజలు లక్ష కోట్లు చెల్లించాల్సిన పరిస్థితి ఉంటుందని ఇది మోయలేని భారం అవుతుందని పేర్కొన్నారు. రాష్ట్రంలో స్మార్ట్ మీటర్ల అమర్చే కాంట్రాక్టును అదానికి కట్ట పెట్టారని విమర్శించారు. ఆదాని కంపెనీ 59,21,344 మీటర్లను బిగించాల్సి ఉందన్నారు. ఈ విధానాన్ని అనుమతించొద్దని సిపిఎం పెద్ద ఎత్తున నిరసన వ్యక్తం చేసిందన్నారు. ట్రూ అప్ ఛార్జీలు, ఇంధన సర్దుబాటు ఛార్జీలను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. స్మార్ట్ మీటర్లు ఉపసంహరించుకోవాలని, సెకి ఒప్పందాలు రద్దు చేయాలని, టైమ్ ఆఫ్ డే విధానాన్ని రద్దు చేయాలని పేర్కొన్నారు. జిల్లాలో సోలార్ పేరుతో బలవంతపు సేకరణ ఆపాలని, లేని పక్షంలో ఆందోళనకు పోరాటాలకు శ్రీకారం చుడతామని హెచ్చరించారు. సమావేశంలో సిపిఎం జిల్లా కార్యదర్శి జి. చంద్రశేఖర్, కార్యదర్శి వర్గ సభ్యులు రామ్మోహన్, అన్వేష్, శివకుమార్, జిల్లా కమిటీ సభ్యులు దస్తగిరిరెడ్డి, శ్రీనివాసులురెడ్డి, చాంద్ బాషా, శ్రీనివాసులు, లక్ష్మీదేవి, గోసియా బేగం, పార్టీ శాఖ కార్యదర్శులు భైరవ ప్రసాద్, రమణ, నరసయ్య, వెంకటేశ్వర్లు, కుమారస్వామి రెడ్డి, రమణ, విద్యార్థి యువజన ప్రజా సంఘాల నాయకులు సునీల్, శివకుమార్ రవి, రాహుల్‌తో పాటు వివిధ ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న ప్రభాకర్‌రెడ్డి

## కూటమి పాలనలో అభివృద్ధి శూన్యం
**ప్రజాశక్తి - కడప**

మాట్లాడుతున్న వైసిపి జిల్లా అధ్యక్షులు

రాష్ట్రంలో 14 నెలల కూటమి పాలనలో అభివృద్ధి ఏమాత్రం లేదని, రూ.1.86 వేల కోట్లు అప్పు మాత్రం చేశారని వైసిపి జిల్లా అధ్యక్షులు పి. రవీంద్రనాథ్ రెడ్డి అన్నారు. గురువారం వైసిపి జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన అన్ని హామీలను చంద్రబాబు నాయుడు ప్రభుత్వం మరిచిందని అన్నారు.ప్రభుత్వ ఉద్యోగులకు అందాల్సిన అరియర్స్ కూడా ఇవ్వలేదని అన్నారు. స్త్రీ నిధి పథకం అమలు చేయాలంటే రాష్ట్రాన్ని అమ్మాలన్న మంత్రి అచ్చెన్నాయుడు వ్యాఖ్యలు దారుణం అని పేర్కొన్నారు. తల్లికి వందనం పథకంలో అరకొరగా లబ్ధిదారులకు అందించారని, నిబంధనల పేరుతో లక్షల మంది లబ్ధిదారులకు కోత విధించారని తెలిపారు. రాష్ట్రంలో అన్ని వర్గాల ప్రజలను, అన్ని కులాల వారిని మోసం చేసిన ఘనత చంద్ర బాబుకే దక్కుతుందని చెప్పారు. సొమ్ము ఒకడిది సోకు ఒకరిది అన్న రీతిలో చంద్రబాబు పాలన సాగిస్తున్నారని విమర్శించారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, అన్నదాత సుఖీభవ పథకాలపై అసలు ఊసే లేదన్నారు. ప్రజలు అన్ని గమనిస్తున్నారని తగిన గుణపాఠం చెబుతారని హెచ్చరించారు. విలేకరుల సమావేశంలో వైసిపి నాయకులు బిహెచ్ ఇలియాస్, పులి సునీల్ కుమార్, నాయకులు పాల్గొన్నారు.

## జిసిడిఒగా రూతు ఆరోగ్య మేరీ
**ప్రజాశక్తి - కడప అర్బన్ :** బాలికా విద్యాభివృద్ధి అధికారిగా రూతు ఆరోగ్యమేరీ బాధ్యతలను స్వీకరించారు. గురువారం కడప ఎన్‌జిఒ కాలనీలోని సమగ్ర శిక్ష కార్యాలయంలో అడిషనల్ ప్రాజెక్ట్ కో- ఆర్డినేటర్ నిత్యానంద రాజు వద్ద అధికారికంగా బాధ్యతలను తీసుకున్నారు. ఈ సందర్భంగా రూతు ఆరోగ్య మేరీ మాట్లాడుతూ జిల్లాలోని కస్తూర్బా పాఠశాలల్లో నాణ్యమైన విద్యను బాలికలకు అందించేందుకు శాయశక్తుల కృషి చేస్తానని తెలిపారు. కెజిబివి పాఠశాలల అభివృద్ధికి నిరంతరం పాటుపడతానని పేర్కొన్నారు.

## గుర్రం జాషువాకు నివాళి
**ప్రజాశక్తి కడప అర్బన్ :** కడప రాజీవ్ కల్చరల్ క్లబ్‌లో గురువారం ఉదయం వైఎస్ఆర్ జిల్లా రచయితల సంఘం ఆధ్వర్యంలో గుర్రం జాషువా 54 వ వర్ధంతిని నిర్వహించారు. మొదట జాషువా చిత్రపటానికి పూల మాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా రచయితల సంఘం జిల్లా అధ్యక్షులు ఆచార్య మూల మల్లికార్జునరెడ్డి మాట్లాడుతూ అసమ సమాజం బాకులు కుమ్మినప్పుడు, అంటరానితనం విషాదం చిమ్మినపుడు ఎవరికైనా జాషువా గుర్తుకొస్తారని, ఆధునిక కవుల్లో జాషువా తర్వాతే ఎవరైనా ఎన్నదగిన వారని తెలిపారు. దుర్భర దారిద్ర్యం వెంటాడినప్పుడు, వేదన గుండెల్లో కుతకుత ఉడికినప్పుడు జాషువా రాసిన గబ్బిలం, పిరదౌసి కావ్యాలు జ్ఞాపకం వస్తాయని చెప్పారు. జాషువా మూఢాచారాలపై తిరుగుబాటు చేశారని, కళకు కులాలున్నాయా అని నాటి సమాజాన్ని ప్రశ్నించారని పేర్కొన్నారు. కార్యక్రమంలో ప్రముఖ రంగస్థలం నటులు ప్రకాష్, దేవరశెట్టి గంగయ్య హరిశ్చంద్ర కాటిసీనులో జాషువా రాసిన పద్యాలను అద్భుతంగా ఆలపించారు. విశ్రాంత తెలుగు అధ్యాపకులు మాలెపాటి సత్యనారాయణ, ప్రముఖ హార్మోనిస్టు రామలింగయ్య, కళాకారులు బాల గంగయ్య, గడికోట రెడ్డయ్య పాల్గొన్నారు.

## సిఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ
**ప్రజాశక్తి - కడప అర్బన్ :** కడప నియోజకవర్గంలో సిఎం రిలీఫ్ ఫండ్ ద్వారా మంజూరైన మొత్తం రూ.22,56,978 విలువైన 30 చెక్కులను టిడిపి పొలిట్ బ్యూరో సభ్యులు, కడప జిల్లా అధ్యక్షులు రెడ్డెప్పగారి శ్రీనివాసరెడ్డి గురువారం పంపిణీ చేశారు. లబ్ధిదారులకు రూ. 3,82,010 విలువైన 9 చెక్కులను పంపిణీ చేయగా, ప్రభుత్వ విప్, కడప ఎమ్మెల్యే మాధవి రూ.18,73,968 విలువైన 21 చెక్కులను లబ్ధిదారులకు అందించారు. సమస్యల్లో ఉన్న కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పిస్తూ, ప్రజల సంక్షేమం కోసం సీఎం రిలీఫ్ ఫండ్‌ను సమర్థవంతంగా వినియోగిస్తున్న కూటమి ప్రభుత్వం ప్రజా సంక్షేమమే లక్ష్యంగా ముందుకు సాగుతోందని వారు తెలిపారు. **ప్రజా దర్బార్..** కడప ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ మాధవి, టిడిపి పొలిట్ బ్యూరో సభ్యులు, కడప జిల్లా అధ్యక్షులు శ్రీనివాసరెడ్డి గురువారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ప్రజా దర్బార్ నిర్వహించారు. ప్రజల నుంచి వచ్చిన పలు సమస్యలు, వినతులను వారు నేరుగా స్వీకరించారు. అత్యవసరమైన సమస్యలపై సంబంధిత శాఖల అధికారులకు తక్షణ ఆదేశాలు జారీ చేశారు. ప్రతి సమస్యపై వెంటనే స్పందిస్తూ, ప్రజలకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవడమే ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని వారు స్పష్టం చేశారు.

ఫిర్యాదుదారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మాధవి

మాట్లాడుతున్న డివైఎఫ్ఐ నాయకులు

## కడప ఉక్కుపై ఎంపీలు గళం విప్పాలి : డివైఎఫ్ఐ
**ప్రజాశక్తి - కడప అర్బన్**
ప్రస్తుతం జరుగుతున్న పార్లమెంటు సమావేశాలలో రాష్ట్రంలోని ఎంపీలు కడప ఉక్కుపై గళం విప్పాలని డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ముడియం చిన్ని, వీరనాల శివకుమార్ తెలిపారు. గురువారం కడప ఆర్కె నగర్‌లోని కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్రం కడప ఉక్కు పైన నిర్లక్ష్యం వహిస్తున్నదన్నారు. సంవత్సరాలు గడుస్తున్న ఇచ్చినా హామీ ఇంత వరకు అమలు కాలేదన్నారు. విభజన హామీ అయిన కడప ఉక్కు పైన కేంద్ర ప్రభుత్వానికి ఎందుకు నిర్లక్ష్యం వహిస్తుందన్నారు. రాష్ట్రంలో కూడా ప్రభుత్వాలు మారుతున్నా ఉక్కుకు నిధులు రాబట్టడంలో విఫలం చెందాయి అన్నారు. ప్రభుత్వాలు మారుతున్నాయి, ముఖ్యమంత్రులు మారుతున్నారూ, ఉక్కు శిలాఫలకాలకే పరిమితం అవుతున్నాయన్నారు. ఉక్కును ఎన్నికల హామీగానే చూస్తున్నారు కానీ వేల మంది నిరుద్యోగులకు ఉపాధి కల్పించే పరిశ్రమ ఏర్పాటుకు ఎందుకు చర్యలు చేపట్టడం లేదని ప్రశ్నించారు. ప్రస్తుతం జరుగుతున్న పార్లమెంటు సమావేశాలలో అయినా రాష్ట్ర ఎంపీలు కడప ఉక్కు పైన గళం విప్పి నిధులు రాబట్టాలని కోరారు. కడప ఉక్కు కోసం రాబోవు రోజులలో పెద్ద ఎత్తున పోరాటాలు నిర్వహిస్తామని తెలిపారు. సమావేశంలో జిల్లా ఉపాధ్యక్షులు రెబ్బా.నరసింహులు, నగర కార్యదర్శి విజయ్, జిల్లా కమిటీ సభ్యులు విశ్వనాథ్,జిల్లా నాయకులు సునీల్ పాల్గొన్నారు.

## ప్రకృతి వ్యవసాయంపై అవగాహన అవసరం
**ప్రజాశక్తి-కడప సిటీ**
ప్రకృతి వ్యవసాయం పైన అవగాహన అవసరమని జిల్లా వ్యవసాయ సంచాలకులు బి.చంద్రానాయక్ పేర్కొన్నారు. గురువారం కడప నగరంలోని వ్యవసాయశాఖ కార్యాలయంలో ప్రకృతి వ్యవసాయంపై మూడు రోజుల శిక్షణ కార్యక్రమంలో భాగంగా రైతు సేవా ఇన్‌ఛార్జులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విచక్షణా రహితంగా ఎరువులు, పురుగుమందుల వాడకాన్ని తగ్గించాలని తెలిపారు. ప్రకృతి వ్యవసాయ పద్ధతులను పాటించడం వల్ల నేల సారవంతంను, పర్యావరణాన్ని కాపాడుకోవచ్చని చెప్పారు. పంట సాగు చేసిన ప్రతి రైతుకూ ఈ పంట నమోదు చేయాలని పేర్కొన్నారు. జిల్లా ఉద్యాన శాఖ అధికారి రవి చంద్ర మాట్లాడుతూ అరటి, నిమ్మ పంటలను ప్రకృతి వ్యవసాయ పద్ధతుల్లో ఎలా సాగు చేయవచ్చో వివరించారు. కడప సహాయ వ్యవసాయ సంచాలకులు ఎస్.వి సురేష్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ గ్రామ వ్యవసాయ సహాయకులు అందరూ ఈ మూడు రోజుల శిక్షణ శిక్షణలో శ్రద్ధగా విని ప్రకృతి వ్యవసాయం పద్ధతులైన బీజామృతం, ఘనజీవామృతం ద్రవ జీవామృతం, కషాయాలు ఏ విధంగా తయారు చేసుకోవాలో తెలుసుకొని రైతులకు తెలియజేయాలని కోరారు. ప్రవీణ్ మాట్లాడుతూ ఈ మూడు రోజుల శిక్షణ ఆన్‌లైన్, క్షేత్రస్థాయిలో శిక్షణ ఇస్తారన్నారు. కడప వ్యవసాయ డివిజన్ పరిధిలోని పెండ్లిమర్రి, ఖాజీపేట, చెన్నూరు, ఒంటిమిట్ట, చింతకొమ్మదిన్నె, కడప మండలాల రైతుసేవా ఇన్‌ఛార్జులు, మండల వ్యవసాయ అధికారులు బి కృష్ణ సుమంత్ రెడ్డి, ఆర్ ఈశ్వరరెడ్డి రెడ్డి, శ్రీదేవి, నాగార్జున, జయలక్ష్మి ఉద్యాన అధికారి ఆర్. జీవన్,పకృతి వ్యవసాయ సిబ్బంది, రైతుసేవా ఇన్‌ఛార్జులు పాల్గొన్నారు.

## అడ్వకేట్‌ను పరామర్శించిన మాజీ డిప్యూటీ సిఎం
**ప్రజాశక్తి - కడప :** ఆపరేషన్ చేయించుకుని విశ్రాంతి తీసుకుంటున్న అడ్వకేట్ సుధాకర్ బాబ్జిని గురువారం మాజీ ఉపముఖ్యమంత్రి అంజాద్‌బాషా పరామర్శించారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. పరామర్శించిన వారిలో కార్పొరేటర్లు కె.బాబు, ఐస్ క్రీమ్ రవి, మహమ్మద్ షఫీ, జిల్లా ఉపాధ్యక్షులు బంగారు నాగయ్య యాదవ్, దాసరి శివప్రసాద్, జిల్లా కార్యదర్శి రమేష్ రెడ్డి, ఈస్ట్ జోన్ అధ్యక్షులు పెద్దిరెడ్డి రామ్మోహన్ రెడ్డి, నాయకులు పేట నాగరాజు, రవి, రత్నం ఉన్నారు.

## రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలి : డిసిసి
**ప్రజాశక్తి - కడప**
జిల్లాలోని చీని నిమ్మకాయల రైతులకు గిట్టుబాటు ధర కల్పిం చాలని ఎన్.డి. విజయ జ్యోతి డిమాండ్ చేశారు. గురు వారం జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పా టు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మా ట్లాడారు. పులివెందుల నియోజకవర్గంలో ఎక్కువగా చీని నిమ్మకాయలు పంట అధికంగా ఉన్నందువల్ల వారికి గిట్టుబాటు ధర కల్పించి ప్రభుత్వం రైతులను ఆదుకోవాలని అన్నారు. రూ. 50 వేలు ఉండే ధర ప్రస్తుతం రూ.15 వేలకు పడిపోవడం చాలా దారుణం అన్నారు. దీనిపై ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలన్నారు. రేటు పెంచి రైతుల దగ్గర నుండి స్వయంగా మార్కెట్లో దళారీ వ్యవస్థ లేకుండా కొనుగోలు చేయాలని అన్నారు. మార్కెట్ యార్డ్‌లో నిల్వ ఉన్న చీని, నిమ్మకాయల రైతులకు భరోసా కల్పించి ప్రభుత్వం నష్టపోయిన రైతులకు వెంటనే ఆదుకోవాలని డిమాండ్ చేశారు. అలాగే రైతుల వద్ద నుండి కొన్న చీని నిమ్మకాయల నగదును తొందరగా ఇవ్వాలని ఆమె డిమాండ్ చేశారు. విలేకరుల సమావేశంలో పులివెందుల నియోజకవర్గ ఇన్‌ఛార్జి ధ్రువకుమార్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ జనరల్ సెక్రెటరీ సయ్యద్ గౌస్ పీర్ , కమలాపురం నియోజకవర్గ ఇన్‌ఛార్జి అశోక్ కుమార్ రెడ్డి, కడప జిల్లా కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు సిరాజుద్దీన్, మాజీ రాష్ట్ర కార్మిక సంఘం చైర్మన్ పుల్లయ్య పాల్గొన్నారు.

విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న డిసిసి అధ్యక్షురాలు

డిసిసిబి చైర్మన్‌ను సన్మానిస్తున్న నాయకులు

## సహకార సంఘాల అభివృద్ధికి సహకరించాలి

**ప్రజాశక్తి - ఖాజీపేట**

ఖాజీపేట అగ్రహారం సహకార సంఘం అభివృద్ధికి సహకరించాలని ఆ సంఘం అధ్యక్షుడు హరినాథ్‌రెడ్డి కోరారు. ఆ మేరకు ఆయన గురువారం కడప డిసిసి బ్యాంక్ చైర్మన్ కార్యాలయంలో సూర్యనారాయణరెడ్డిని కలిశారు. ఈ సందర్భంగా హరినాథ్‌రెడ్డి చైర్మన్ సూర్యనారాయణరెడ్డిని ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో మండల టిడిపి అధ్యక్షుడు లక్ష్మిరెడ్డి, కేసీ కెనాల్ డిస్ట్రిబ్యూటరీ కమిటీ చైర్మన్ దుంపలగట్టు రవీంద్రారెడ్డి, మార్కెట్ యార్డు డైరెక్టర్ వెంకట్రామిరెడ్డి, టిఎన్‌ఎస్‌ఎఫ్ నాయకులు పల్లె గంగాధర్ పాల్గొన్నారు.

## 'ఉపాధి' వేతనాలకు ఎదురుచూపులు

**ప్రజాశక్తి - తొండూరు**

ఉపాధి హామీ చట్టం కూలి జూన్ నెల నుంచి అందడంలేదని కూలీలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఆరు వారాలుగా శ్రమించిన కూలి అందలేదని వాపోతున్నారు. ఎక్కువగా పల్లెలకు చెందిన పేద కుటుంబాలు, మహిళలు ఉపాధి హామీ పనులను ఆధారంగా జీవిస్తున్న తరుణంలో ఇలా వేతనాలు అందకపోవడం భారంగా మారిందని ఆవేదన వెలిబుచ్చుతున్నారు. పనులకు వెళ్లినా వేతనాలు ఇవ్వలేదన్న కారణంతో చాలా మంది పోవడంలేదు. ప్రభుత్వం తక్షణమే స్పందించి వేతనాలు విడుదల చేయాలని కోరుతున్నారు.

**పాలు కొనాలన్నా పైసా లేదు..**

రోజూ పొద్దునే వెళ్తున్నా.. కానీ రూపాయి కూడా రాలేదు. పిల్లలకు పాలు కొనాలన్నా చేతిలో పైసా లేదు.

**- అనంతమ్మ, కూలి, గంగాదేవిపల్లి.**

**ప్రభుత్వం వెంటనే స్పందించాలి..**

చెమటోడ్చి పని చేసినా వేతనం రాకపోతే ఎలా బతకాలి. ప్రభుత్వం వెంటనే స్పందించాలి. కూలి చెల్లించాలి.

**-మల్లేష్, కూలి, తొండూరు.**

**త్వరలోనే కూలి జమ అవుతుంది..**

పద్ధతి ప్రకారం వేతనాలు డేటా ఎంట్రీ అనంతరం కేంద్రం ద్వారా విడుదల అవుతాయి. కొంత సాంకేతిక కారణాలతో జాప్యం జరిగింది. ఉన్నతాధికారులకు నివేదిక పంపాం. త్వరలోనే కూలీల వేతనాలు వారి ఖాతాల్లో జమ అవుతాయి.

**- లావణ్య, ఎపిఒ, తొండూరు.**

ఎంపిడిఒకు వినతిపత్రం ఇస్తున్న ప్రజలు

## ఆక్రమణదారులపై చర్యలు తీసుకోవాలని వినతి

**ప్రజాశక్తి - ఖాజీపేట**

మండల పరిధిలోని పుల్లూరు పంచాయితీ పుల్లూరు మాలవాడలో కొందరు ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించి కట్టడాలు కడుతున్నారని, పంట కాలువను కూడా పూడ్చి నిర్మాణాలు చేపడుతున్నారని, వెంటనే విచారించి చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరారు. ఆమేరకు వారు గురువారం అధికారులకు వినతి పత్రం ద్వారా విన్నవించారు. ఎంపిడిఒ దివిజా సంపతి, తహశీల్దార్ రవణమ్మ, పంచాయతీ కార్యదర్శికి వినతి పత్రాలు సమర్పించారు. సర్వేనెంబర్ 307, 301 ప్రాంతాల్లో అక్రమ కట్టడాలు జరుగుతున్నాయని ఫిర్యాదులో పేర్కొన్నారు.

మౌలానాను సన్మానిస్తున్న పంచాయతీ కార్యదర్శులు

## పిఎస్ సంఘం మండల అధ్యక్షుడిగా మౌలానా

**ప్రజాశక్తి - చాపాడు**

మండల పరిధిలోని పంచాయతీ కార్యదర్శులు గురువారం సాధారణ సమావేశాన్ని మండల కార్యాలయ సభా భవనంలో నిర్వహించారు. ఈ సందర్భంగా సభ్యులు ఏకగ్రీవంగా మండల కమిటీని ఎన్నుకున్నారు. పంచాయతీ కార్యదర్శుల మండల అధ్యక్షుడిగా పల్లవోలు పంచాయతీ కార్యదర్శి ఎస్ఎండి మౌలానాను ఎన్నుకున్నారు. జాయింట్ సెక్రటరీగా బద్రిపల్లె పంచాయతీ కార్యదర్శి చంద్రశేఖర్, ట్రెజరర్‌గా నాగులపల్లె పంచాయతీ కార్యదర్శి జ్యోష్నను ఎన్నుకున్నారు. సభ్యులుగా శ్రీనివాసులు రెడ్డి, లక్ష్మీప్రసన్న ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు మౌలానా మాట్లాడుతూ పంచాయతీ కార్యదర్శుల సమస్యల పరిష్కారానికి తమ వంతు కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు, డిజిటల్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

## కాపర్ వైర్ చోరీ

**ప్రజాశక్తి- ముద్దనూరు**

ఆరవేటిపల్లె గ్రామంలో రైతు తాటి రామాంజనేయులు పొలంలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ తీగలు, కాపర్ వైర్ గురువారం చోరీకి గురయ్యాయి. విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లకు రక్షణ లేకుండా పోయిందని రైతు వాపోయాడు.

## 14 ఎర్రచందనం దుంగలు స్వాధీనం

**ప్రజాశక్తి - చాపాడు**

మండల పరిధిలోని నాగులపల్లి వద్ద 14 ఎర్రచందనం దుంగలను గురువారం స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ చిన్న పెద్దయ్య తెలిపారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఆయన మాట్లాడుతూ ప్రొద్దుటూరు జగనన్న కాలనీ నుండి 281 కిలోల ఎర్రచందనం దొంగలను ఏపీ 07 సిపి 9939 కారులో 14 ఎర్రచందనం దుంగలను బెంగళూరుకు తరలిస్తుండగా పట్టుకున్నామన్నారు. సీఐ శివశంకర్ యాదవ్ సూచనల మేరకు వాహన తనిఖీ చేపడుతుండగా నిందితులు ఐదుమంది తప్పించుకునే ప్రయత్నం చేశారన్నారు. సిబ్బంది వెంబడించి పట్టుకున్నారని పేర్కొన్నారు. ఐదుమంది నిందితుల్లో ఇద్దరిని అరెస్టు చేశామన్నారు. ముగ్గురు పరారీలో ఉన్నారన్నారు. బోయకుమార్, కిషోర్‌ను కోర్టుకు హాజరు పరిచామన్నారు. కార్యక్రమంలో ఏఎస్ఐ అహ్మద్ బాషా, పోలీస్, ఫారెస్ట్ సిబ్బంది పాల్గొన్నారు.

పట్టుకున్న ఎర్రచందనం దుంగలు, అరెస్టయినవారితో పోలీసులు

# ముత్తుకూరులో అధ్వానంగా రోడ్లు

**ప్రజాశక్తి - వేంపల్లె**

మండలంలోని ముత్తుకూరు గ్రామంలో రోడ్లు అధ్వానంగా తయారయ్యాయి. గ్రామ ప్రజలు చాలా అవస్థలు పడుతున్నారు. ముత్తుకూరు ఎస్సీ కాలనీతోపాటు ఆయా ప్రాంతాల్లో రోడ్లు, మురుగు కాలువలు లేక ప్రజలు చాలా అవస్థలు పడుతున్నారు. మురుగునీరు రోడ్లపై పారుతోంది. ఇళ్లముందు మురుగునీరు నిలిచి దుర్వాసన వెదజల్లుతోందని స్థానికులు అల్లాడిపోతున్నారు. సమస్యను ప్రజాప్రతినిధులు, అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ప్రయోజనం లేదని వాపోతున్నారు. వర్షపు నీరు ఒక చుక్క కూడా బయటికి వెళ్లే కుండా వీధుల్లోనే నిలిచి పోవడంతో దోమలు ఎక్కువై జబ్బుల పాలవుతున్నామని ఆవేదన చెందుతున్నారు. కొన్నేళ్లుగా రోడ్ల పరిస్థితి అధ్వానంగా ఉందని తెలిపారు. వర్షపు నీరు నిల్వ ఉన్న రహదారిలో నడవలన్నా చాలా ఇబ్బందులు పడుతున్నామని పేర్కొంటున్నారు. ఇప్పటికైనా తమ అవస్థలను తొలగించేందుకు ముత్తుకూరు గ్రామంలో మురుగు కాలువలు, రోడ్లను వేయించాలని ప్రజలు కోరుతున్నారు.

ముత్తుకూరు ఎస్సీ కాలనీలో నిలిచిన వర్షపునీరు

# కూటమి ప్రభుత్వానిది ప్రజా వ్యతిరేక పాలన

మాట్లాడుతున్న ఎమ్మెల్సీ పి.రామసుబ్బారెడ్డి

**ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్**

రాష్ట్రంలోని కూటమి పాలన ప్రజా వ్యతిరేకంగా సాగిస్తోందని వైసిపి ఎమ్మెల్సీ పి.రామసుబ్బారెడ్డి విమర్శించారు. స్థానిక ఓ కల్యాణ మండపంలో గురువారం ఆయన మున్సిపాలిటీ పరిధిలోని నాయకులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా చంద్రబాబు ష్యూరిటీ.. మోసం గ్యారంటీ అనేది కూటమి పాలనకు కరెక్టుగా సరిపోతుందన్నారు. రాష్ట్రంలో రైతుల పరిస్థితి చాలా దారుణంగా ఉందన్నారు. ఆడబిడ్డ నిధితో మహిళలకు ఆశ చూపి అధికారంలోకి వచ్చారన్నారు. రాష్ట్రంలో అసమర్థ పాలన సాగుతోందన్నారు. రైతులు, మహిళలు, ప్రజలపై ఏమాత్రం చిత్తశుద్ధి లేకుండా పాలన చేస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో పొన్నపురెడ్డి గిరిధర్‌రెడ్డి, జిల్లా మున్సిపల్ విభాగం అధ్యక్షుడు వల్లూరు రుషికేశవరెడ్డి, బీసీ సెల్ నేత గురుమూర్తి యాదవ్, లోగిడి జయన్న, గజ్జల లక్ష్మయ్య, పోరెడ్డి మహేశ్వర్‌రెడ్డి, ముల్లా జానీ, పోచిరెడ్డి, వెంకటేశు, షామీర్, కొండారెడ్డి, మార్బుల్ శ్రీను, వైసిపి కౌన్సిలర్లు, ముఖ్య కార్యకర్తలు పాల్గొన్నారు.

# రైతుల బాధలు పట్టని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు

**ప్రజాశక్తి - వేంపల్లె**

కేంద్రంలోని మోడీ ప్రభుత్వానికి, రాష్ట్రంలోని చంద్రబాబు ప్రభుత్వానికి రైతుల బాధలు ఏ మాత్రం పట్టడం లేదని పిసిసి అధి.కార ప్రతినిధి తులసిరెడ్డి విమర్శించారు. గురు వారం వేంపల్లెలో ఆయన విలేకరులతో మాట్లా డుతూ వర్షాభావంతో రైతులు తీవ్ర ఇబ్బందుల్లో ఉన్నారని ఆందోళన వ్యక్తం చేశారు. మిర్చి, పొగాకు, మామిడి, చీని, పసుపు తదితర పంట లకు గిట్టుబాటు ధర లభించడం లేదన్నారు. పం టల బీమా ప్రీమియం పెంచారే తప్ప, పంటల బీమా పథకం అమలు కావడం లేదన్నారు. ఇన్‌పుట్ సబ్సిడీ అందడం లేదని పేర్కొన్నారు. యూరియా కొరత తీవ్రంగా ఉందన్నారు. కాంప్లెక్స్ ఎరువుల ధరలు అమాంతంగా పెరిగా యన్నారు. 50కిలోల పొటాష్ రూ.1,535 నుండి రూ.1,800కు, 10-26-26 రూ.1,470 నుండి రూ.1,800కు పెరిగిం దన్నారు. రైతులకు ఖర్చులు పెరిగాయని తెలి పారు. అన్నదాత సుఖీభవ పథకం కింద ప్రతి ఏటా ప్రతి రైతుకూ రూ.20,000 ఆర్థిక సాయం చేస్తామని కూటమి పార్టీలు ఎన్నికల మ్యానిఫెస్టోలో పేర్కొన్నాయని, అధికారంలోకి వచ్చి 14 నెలలైనా ఇప్పటివరకు 20 పైసల సాయం చేయలేదని విమర్శించారు. కేంద్ర ప్రభు త్వం 15వ ఆర్థిక సంఘం నిధులు గత సెప్టెంబర్ నెలలో రూ.989 కోట్లు, డిసెంబర్‌లో రూ.1,121 కోట్లు రాష్ట్ర ప్రభుత్వానికి విడుదల చేసిందని చెప్పారు. 10 రోజుల్లో ఆ నిధులను రాష్ట్ర ప్రభుత్వం స్థానిక ప్రభుత్వాలకు విడుదల చేయాలి కానీ, 9 నెలలైనా కూటమి ప్రభుత్వం స్థానిక ప్రభుత్వాలకు విడుదల చేయలేదని విమర్శించారు. ఆ నిధులను వేరే కార్యక్రమాలకు మళ్లించిందని విమ ర్శించారు. నిధులు లేక గ్రామ పంచాయతీలు పారిశుధ్యం, తాగునీటి సరఫరా వంటి కార్యక్రమాలను నిర్వహించలేక పోతున్నట్లు చెప్పారు. పెండింగ్ బకాయిలతో సహా అన్నదాత సుఖీభవ పథకం నిధులు వెంటనే విడుదల చేయాలని తులసిరెడ్డి డిమాండ్ చేశారు. పెంచిన రసాయన ఎరువుల ధరలు వెంటనే తగ్గించాలని కోరారు. యూరియా కొరత లేకుండా చూడాలని చెప్పారు. కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన 15వ ఆర్థిక సంఘం నిధులను వెంటనే రాష్ట్ర ప్రభుత్వం స్థానిక ప్రభుత్వాలకు విడుదల చేయాలని తులసిరెడ్డి కోరారు.

పిసిసి అధికార ప్రతినిధి తులసిరెడ్డి

మాట్లాడుతున్న మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ చిన్నప్ప

## దళారులతో కుమ్మక్కై రైతులకు వెన్నుపోటు

**ప్రజాశక్తి - పులివెందుల రూరల్**

దళారులతో కుమ్మక్కై కూటమి ప్రభుత్వం రైతులను వెన్నుపోటు పొడుస్తోందని పులివెందుల మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ చిన్నప్ప పేర్కొన్నారు. వైసిపి ప్రభుత్వంలో రైతుల సంక్షేమం కోసం పండించిన పంటలను ఇతర మార్కెట్లకు తరలించకుండా పులివెందులలోనే మార్కెట్ ఏర్పాటు చేశామన్నారు. ఇక్కడి నుంచి ఇతర ప్రాంతాలకు ఎగుమతి చేసుకునేలా సుమారు రూ.5కోట్లతో చీని కాయల మార్కెట్‌ను ఏర్పాటు చేశామన్నారు. పులివెందుల ప్రాంతంలో పండించిన అరటి ఇతర దేశాల్లో కూడా మంచి డిమాండ్ ఉండడంతో ఈ ప్రాంతంలో పండించిన అరటిని రైతులు నిలువ చేసుకొని ఇతర ప్రాంతాలకు ఎగుమతి చేసుకునేలా రూ.28 కోట్లతో కోల్డ్ స్టోరేజ్ నిర్మించామన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 18 నెలలవుతున్నా కోల్డ్ స్టోరేజ్ గురించి పట్టించుకోలేదన్నారు. కరోనా క్లిష్ట పరిస్థితుల్లో కూడా దళారి వ్యవస్థ లేకుండా కోట్లాది రూపాయలను చీని రైతుల అకౌంట్లో వేసిన ఘనత వైఎస్ జగన్మోహన్‌రెడ్డి, కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డికే దక్కుతుందన్నారు. రెండు రోజుల క్రితం టిడిపి నాయకులు పులివెందుల వ్యవసాయ మార్కెట్‌లోని చీని కాయల మార్కెట్‌ను సందర్శించి అధికారులు, వ్యాపారాలు, రైతుల గురించి దళారులు మోసం చేస్తున్నారని బీటెక్ రవి మాట్లాడటం విడ్డూరంగా ఉందన్నారు.

## ప్రజల దృష్టి మళ్లించేందుకే అక్రమ అరెస్టులు

**ప్రజాశక్తి - తొండూరు**

తమ వైఫల్యాలపై ప్రజల దృష్టి మళ్లించేందుకు కూటమి ప్రభుత్వం అక్రమ అరెస్టులు చేస్తున్నట్లు వైసిపి జిల్లా ప్రచార కార్యదర్శి దేవర శ్రీనివాసులరెడ్డి విమర్శించారు. టీడీపీ హయాంలో జరిగిన మద్యం స్కాం కేసులో ప్రభుత్వ ప్రవర్తనపై ఆగ్రహం వ్యక్తం చేశారు. జరిగిందేమీలేదు.. కానీ లిక్కర్ స్కామ్ జరిగిందని చూపించే ప్రయత్నం చేస్తున్నారని తెలిపారు. ఎంపీ మిథున్‌రెడ్డి అరెస్టు అక్రమమన్నారు. ఇది ప్రజాస్వామ్యానికి మచ్చగా పేర్కొన్నారు. అవినీతి కేసుల్లో నిందితుడైన చంద్రబాబు ఇప్పటికీ బెయిల్ పైనే ఉన్నారన్నారు. సమావేశంలో బిసి జిల్లా ప్రధాన కార్యదర్శి కోట్లూరు సుదర్శన్, యువజన విభాగం సభ్యుడు లక్ష్మిరెడ్డి, నాయకుడు యాడికి బాబుల్‌రెడ్డి పాల్గొన్నారు.

## 27న జిల్లా స్థాయి అథ్లెటిక్స్ పోటీలు

**ప్రజాశక్తి - ప్రొద్దుటూరు**

బాషా అథ్లెటిక్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో పురుషులు, మహిలలకు ఈనెల 27న ఆదివారం స్థానిక అనిబిసెంట్ మున్సిపల్ హైస్కూల్ స్థలంలో జిల్లాస్థాయి అథ్లెటిక్స్ పోటీలు నిర్వహిస్తామని ఫౌండేషన్ కార్యదర్శి అహ్మర్ బాషా తెలిపారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. అండర్-18 విభాగంలో, అండర్-20 విభాగంలో పోటీలు నిర్వహిస్తామన్నారు. 100 మీ, 200 మీ, 400 మీ, 1000 మీ, లాంగ్ జంప్, హై జంప్, షార్ట్ పుట్ డిస్క్ త్రో క్రీడలలో పోటీలు నిర్వహిస్తామన్నారు. ఇందులో కడప జిల్లా వారు ఎవరైనా పాల్గొనవచ్చు అన్నారు. ప్రతిభ కనబరచిన వారిని ఆగస్టు నెల 9, 10, 11 తేదీల్లో ఆచార్య నాగార్జున యూనివర్సిటీ గుంటూరులో నిర్వహించే జూనియర్ అథ్లెటిక్స్ ఛాంపియన్షిప్‌నకు ఎంపిక అవుతారన్నారు. ఇందులో 16ఏళ్లు నిండిన వారు మాత్రమే పాల్గొనవలసి ఉంటుందన్నారు. ఆధార్ కార్డు లేదా బర్త్ సర్టిఫికెట్ గానీ నిర్వాహకులకు సమర్పించవలసి ఉంటుందన్నారు. విజేతలకు ప్రశంసపత్రం అందజేస్తారని తెలిపారు. మరిన్ని వివరాలకు 99496 86586ను సంప్రదించాలన్నారు.

## మొక్కలు పెంచి పర్యావరణాన్ని పరిరక్షించాలి

**ప్రజాశక్తి - చాపాడు**

మొక్కలు పెంచి పర్యావరణాన్ని పరిరక్షించాలని లెక్కలవారిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు కె.నరసింహులు పిలుపునిచ్చారు. రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత, పర్యావరణ మిత్ర ప్రొద్దుటూరు రోటరీ క్లబ్ ప్రెసిడెంట్ రొటేరియన్ గజ్జల వెంకటేశ్వరరెడ్డి గురువారం 125 మొక్కలను పాఠశాలకు అందజేశారు. వీటిని పాఠశాల ఆవరణలో ఉపాధ్యాయులు, విద్యార్థులు నాటారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు మాట్లాడుతూ సమస్త జీవరాశుల మనుగడకు జీవనాధారం మొక్కలే అన్నారు. భవిష్యత్తు తరాల మనుగడకు మొక్కలను నాటి సంరక్షించడం మనందరి బాధ్యత అన్నారు. ప్రతి ఒక్కరూ సామాజిక బాధ్యతగా ఈ కార్యక్రమాన్ని కొనసాగించాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రాజశేఖర్‌రెడ్డి, సాదిక్, రామిరెడ్డి, అరుణ చంద్రకళ, మనోహర్ రెడ్డి, ఓబులేసు, విద్యార్థులు పాల్గొన్నారు.

మొక్కలతో లెక్కలవారిపల్లె జడ్‌పి పాఠశాల ఉపాధ్యాయులు

## ఘనంగా పద్మశ్రీ 'అయ్యం'కి జయంతి వేడుకలు

**జమ్మలమడుగు రూరల్ :** జమ్మలమడుగు ప్రభుత్వ గ్రంథాలయంలో గ్రంథాలయ పితామహులు పద్మశ్రీ అయ్యంకి వెంకటరమణయ్య జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించామని జమ్మలమడు శాఖ గ్రంథాలయాధికారి నాదెండ్ల బాబ్జి తెలిపారు. గురువారం అయ్యంకి చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రంథాలయ ఉద్యమం ద్వారా సామాన్య ప్రజలను చైతన్య వంతులుగా చేసిన గ్రంథాలయ పితామహుడు అయ్యంకి వెంకటరమణయ్య అని, ఆయన చేసిన సేవలు అమోఘమన్నారు. తన జీవితాంతం గ్రంథాలయ అభివృద్ధి కోసమే పని చేశారని కొనియాడారు. కవి కోకిల గుర్రం జాషువా వర్ధంతిని కూడా ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో గ్రంథాలయ కమిటీ సభ్యులు డాక్టర్ నరసింహులు, కుండా భాస్కర్, కవల రామయ్య, వెంకటేశ్వరరెడ్డి, అమీర్‌బాషా పాల్గొన్నారు.

## నిధుల దుర్వినియోగంలో డిప్యూటీ ఎంపిడిఒ సస్పెన్షన్

**ప్రజాశక్తి-వీరబల్లి :** మండలంలోని పలు గ్రామాల్లో నిధుల దుర్వినియోగంలో వీరబల్లి డిప్యూటీ ఎంపిడిఒ రామచంద్రారెడ్డిని కలెక్టర్ శ్రీధర్ చామకూరి సస్పెండ్ చేశారు. మండలంలో సానిపాయి, తాటిగుంటపల్లి గ్రామ పంచాయతీలలో ప్రభుత్వ నిధులు భారీగా దుర్వినియోగం కావడం, విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహించినందుకు రామచంద్రారెడ్డిని సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. గ్రామ పంచాయతీలలో నిధుల దుర్వినియోగాన్ని పర్యవేక్షించడంలో ఆయన విఫలమయ్యారు. వంగిమళ్ళ గ్రామ పంచాయతీలో ప్రత్యేక అధికారిగా ఉంటూ పంచాయతీ కార్యదర్శులకు తెలియకుండా వారి డిజిటల్ కీలను ఉపయోగించి ప్రభుత్వ నిధులు స్వయంగా డ్రా చేసినట్లు విచారణలో తేలింది. ఆయనపై తక్షణమే సస్పెన్షన్ వేటు వేస్తున్నట్లు డిపిఒ రాధమ్మ, ఎంపిడిఒ జవహర్ బాబు పేర్కొన్నారు.

## రాష్ట్ర స్థాయి క్రీడలకు 'ఆదిత్య' విద్యార్థి ఎంపిక

**ప్రజాశక్తి-మదనపల్లె:** ఆదిత్య ఇంజినీరింగ్ కళాశాలకు చెందిన కంప్యూటర్ సైన్స్ విభాగంలోని రెండవ సంవత్సరం విద్యార్థి జి.ప్రసాంత్ అండర్-19 రాష్ట్ర స్థాయి షటిల్ బ్యాడ్మింటన్ టీమ్‌కు ఎంపికయ్యాడని కళాశాల డైరెక్టర్ డాక్టర్ ఎస్. రామలింగారెడ్డి తెలిపారు. తమ విద్యార్థి ఈ ఘనత సాధించడం పట్ల కళాశాల చైర్మన్ ఆర్.రామ్మోహన్‌రెడ్డి, ప్రెసిడెంట్ ఎం.నాగ మల్లారెడ్డి అభినందించారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని రాష్ట్ర స్థాయిలో అత్యుత్తమ ప్రదర్శన ఇవ్వాలని అతనికి ప్రిన్సిపల్ డాక్టర్ ఎస్.రాయుడు శుభాకాంక్షలు తెలియజేశారు.

మాట్లాడుతున్న ఎడి ఎ.ప్రభాకర్ రెడ్డి

## మానవాళి మనుగడకు ప్రకృతి వ్యవసాయం తప్పనిసరి : ఎడి

**ప్రజాశక్తి - పులివెందుల రూరల్**

మానవాళికి ప్రకృతి వ్యవసాయం తప్పనిసరి అని పులివెందుల ఎడి ఎ.ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. పులివెందులలోని మినీ సెక్రటేరియట్‌లో గురువారం ఆయన మాట్లాడుతూ గ్రామస్థాయిలో రైతుల్లో ప్రకృతి వ్యవసాయాన్ని విస్తారంగా ముందుకు తీసుకు వెళ్లడానికి వ్యవసాయ శాఖ సిబ్బంది శిక్షణనిచ్చారు. ఏ విధంగా రైతులను ప్రభావితం చేయాలనే విషయాలపై శిక్షణ ఇచ్చారు. ఉద్యానశాఖాధికారి రాఘవేందర్ రెడ్డి మాట్లాడుతూ అరటి, చీని పంటలు పులివెందుల డివిజన్‌లో ఎక్కువని, వాటికి పోషకలు అందించే విధానంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పులివెందుల మండల వ్యవసాయ అధికారి చెన్నారెడ్డి, వేముల వ్యవసాయ అధికారి ఓబులేసు పాల్గొన్నారు.

**ముద్దనూరు :** సహజ సిద్ధమైన పద్ధతులను అనుసరించి ప్రకృతి వ్యవసాయంతో పంటలు సాగు చేసేలా రైతులకు అవగాహన కల్పించాలని ముద్దనూరు వ్యవసాయ శాఖ సహాయ సంచాలకులు రామమోహన్‌రెడ్డి సిబ్బందికి సూచించారు. స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయ సభా భవనంలో గురువారం ఎడి ఆధ్వర్యంలో ప్రకృతి వ్యవసాయంపై ముద్దనూరు వ్యవసాయ శాఖ సబ్ డివిజన్ పరిధిలోని క్షేత్రస్థాయి సిబ్బందికి శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. రాష్ట్రస్థాయి ఎస్‌పిఎం యు సురేష్‌కుమార్ మాట్లాడుతూ భూమి కలుషితం కాకుండా సహజ సిద్ధమైన పద్ధతులను అనుసరించి ప్రకృతి వ్యవసాయంతో పంటలను సాగు చేయాలన్నారు. ప్రతి ఒక్క రైతు సహజ సిద్ధ పద్ధతులను పాటించేలా రైతులకు అవగాహన కల్పించాలన్నారు. రాబోయే రోజుల్లో సేంద్రియ పద్ధతుల ద్వారా పండించే ఉత్పత్తులకు మంచి డిమాండు ఉంటుందన్నారు. సహజ సిద్ధ వ్యవసాయంలో రాజీలేని సూత్రాల గురించి రైతులకు వివరించాలన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ అధికారులు వెంకట కృష్ణారెడ్డి, రాజు, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది నుజహత్, రామసుధ, మాస్టర్ ట్రైనర్ నాగ సుబ్బరాయుడు, ఆత్మ ఎటిఎం, బిటియం పాల్గొన్నారు.

## కనీస సౌకర్యాల్లేని మైదుకూరు ఆర్‌టిసి బస్టాండ్

**ప్రజాశక్తి - చాపాడు (మైదుకూరు)**

సమస్యను చూపుతున్న నాయకులు

మైదుకూరు బస్టాండ్ ఆవరణలో పారిశుధ్యం అధ్వా నంగా ఉందని ఏపీ రైతు సంఘం అధ్యక్షులు ఎవి రమణ పేర్కొన్నారు. గురు వారం బస్టాండ్ ఆవరణను రైతు సంఘం నాయకులు పరిశీలించారు. ఈ సం దర్భంగా ఆయన మాట్లాడుతూ బస్టాండ్‌కు సంబంధించిన ఖాళీ ప్రదేశాలను నెలవారీ బాడుగలకు ఇచ్చి తద్వారా రూ.కోటిపైన ఆదాయం గడిస్తున్నారని తెలిపారు. అధికారుల నిర్లక్ష్యంతో బస్సు ప్రయాణానికి బస్టాండ్‌కు వస్తున్న ప్రయాణికులకు మౌలిక సౌకర్యాలు కల్పించడంలో చాలా దారుణంగా ఉందన్నారు. చిన్నపాటి వర్షానికే బస్టాండ్ బురద, మురికికుంటగా తయారవుతుంది. ఇందులో నడవాలంటే ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇబ్బందికరంగా ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వెంటనే ఆర్టీసీ అధికారులు స్పందించి ప్రయాణికులకు మౌలిక వసతులు, సౌకర్య వంతంగా ఉండేలా చూడాలన్నారు. లేనిపక్షంలో ప్రయాణికులతో కలిసి ఆందోళన నిర్వహిస్తామని హెచ్చరించారు. ఆర్టీసీ అధికారి విజయమ్మతో కలిసి వారు పరిశీలించారు. రైతు సేవా సమితి సభ్యులు, ప్రయాణికులు తిప్పాయపల్లె సుబ్రహ్మణ్యం, మూలే రామాంజనేయరెడ్డి, పిరయ్య, వెంకట నారాయణ, గోపాల్, రైతు సేవాసమితి పట్టణ సమితి అధ్యక్ష కార్యదర్శులు కే.రామ్మోహన్, చెక్‌పోస్ట్ శ్రీనివాసులు పాల్గొన్నారు.

## మహిళల రక్షణ కోసమే శక్తి యాప్

**ప్రజాశక్తి - ఖాజీపేట**

ప్రభుత్వం మహిళల రక్షణ కోసం ప్రత్యేక చట్టాలను ప్రవేశపెట్టిందని, అత్యవసర సమయాల్లో 112, 118, 1098, 1930 ఉచిత నెంబర్లకు ఫోన్ చేసి సేవలను పొందవచ్చునని యాంటీ హ్యూమన్ ట్రాఫికింగ్ యూనిట్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ఇదురు బాషా పేర్కొన్నారు. గురువారం ఆదర్శ పాఠశాల జూనియర్ కళాశాల విద్యార్థులకు శక్తి యాప్ గురించి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ.. మహిళలపై దాడులు, ఈవ్ టీజింగ్ వంటి ఇబ్బందులకు గురైతే వెంటనే 112 సమాచారం ఇవ్వాలని సూచించారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## పాఠశాలలో హెచ్‌ఎం తనిఖీ

**ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్**

స్వయానా తన అన్న పని చేస్తున్న పాఠశాలను అధికారి హోదాలో చెల్లెలు గురువారం తనిఖీ చేశారు. వివరాల్లోకి వెళితే.. పెద్దముడియం మండల పరిధిలోని పెద్దపసుపుల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలుగా ఎస్.జరీనా బేగం పని చేస్తున్నారు. పెద్దపసుపుల పాఠశాల క్లస్టర్ కాంప్లెక్స్‌గా కూడా ఉంది. ఇటీవల జరిగిన బదిలీల్లో పెద్దపసుపుల కాంప్లెక్స్ పరిధిలోని ఉలవపల్లె మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ఏకోపాధ్యాయుడుగా అమీర్‌బాషా చేరారు. కాగా అమీర్ బాషా, జరీనా బేగం జమ్మల మడుగు పట్టణానికి చెందిన దివంగత ప్రముఖ విశ్రాంత తెలుగు పండింట్, కవి, సీనియర్ జర్నలిస్ట్ అయిన విద్వాన్ కమాల్ సాహెబ్ సంతానం. కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయురాలి హోదాలో జరీనా బేగం గురువారం మధ్యాహ్నం ఉలవపల్లె ప్రాథమిక పాఠశాలను తనిఖీ చేశారు. పాఠశాల రికార్డులను పరిశీలించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం అమీర్ బాషా, సీనియర్ ఉపాధ్యాయుడు సర్దార్ మొహిద్దీన్, సిఎంఆర్టి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు. ఈ క్రమంలో పెద్దపసుపుల కాంప్లెక్స్ పరిధిలోని కొత్తపల్లె, మేడిదిన్నె, చిన్నపసుపుల తదితర పాఠశాలలను కూడా జరీనా బేగం తనిఖీ చేశారు.

రికార్డులను పరిశీలిస్తున్న జరీనాబేగమ్

**రాజశ్రీ జమ్మలమడుగు జూనియర్ సివిల్ జడ్జి కోర్టు నందు**

**O.S.No. 135/2024**

టంగుటూరి క్రిష్ణారెడ్డి, 39 సం॥లు, S/o టంగుటూరి చిన్న పుల్లారెడ్డి, హిందూ, Working in B.S.F., R/o D.No.1/49, కాపు వీధి, కరమలవారిపల్లె గ్రామం, మైలవరం మండలం, కడప జిల్లా. ...వాది

**Vs**

మారంరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి, 38 సం॥లు, S/o లేట్ మారంరెడ్డి కంబగిరి రెడ్డి అలియాస్ మారంరెడ్డి తిక్కోజి గారి కంబగిరి రెడ్డి, హిందూ, వ్యాపారం, R/o D.No.21/16/2D-11, శ్రీరామ్‌నగర్, జమ్మలమడుగు టౌన్ అండ్ మండలం, కడప జిల్లా. ...ప్రతివాది

**ప్రతివాదికి సమను**

పై వాది ప్రతివాదియైన నీ పైన రూ.1,84,500/- రాబట్టుట నిమిత్తమై పై దావా దాఖలు చేసినాడు. ఈ దావా పైన నీకు ఏమైనా అభ్యంతరాలు ఉంటే 31.07.2025వ తేదీన ఉ॥ 10.30 గం॥లకు పై కోర్టు నందు హాజరయ్యి స్వయముగా గాని, లేక వకీలు ద్వారా గాని తెలుపుకోవలయును. లేనంతట పై దావా నీ పరోక్షమున తీర్మానించబడును.

**వాయిదా తేది: 31.07.2025**

//కోర్టు ఉత్తర్వుల మేరకు//

**వి. రమేష్ బాబు**

అడ్వకేటు, ప్రొద్దుటూరు.

**మహారాజశ్రీ ప్రొద్దుటూరు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో**

**O.S.No. 346/2020**

Union Bank of India, represented by its Branch Manager, Zinna Road Branch, Proddatur Town, Kadapa Dist. ...Plaintiff

**Vs**

Kuppam Kishore Kumar, S/o Jaya Ramaiah, aged about 34 years, Hindu, Business, residing at D.No.7/3992-5-1, Srinivasa Nagar, Proddaturu Town, Kadapa Dist. ...Defendant

**ప్రతివాదికి సమను**

పై నెంబరు దావాను ప్రతివాది పైన దావా రికవరీకి గాను దావా దాఖలు చేయడమైనది. అట్టి ప్రతివాది అయిన నీవు పై కోర్టులో 30.07.2025వ తేదీన ఉదయం 10.30 ని॥లకు నీవు గానీ, నీ తరపున వకీలు గారు గానీ హాజరు కావలెను. అట్లు హాజరు కానంతట నీ పైన పరోక్షంగా తీర్మాణించబడును.

**వాయిదా తేది: 30.07.2025**

//రాజశ్రీ కోర్టు వారి ఉత్తర్వు మేరకు//

**మెట్టుపల్లి సుధాకర్ రెడ్డి**

అడ్వకేటు, ప్రొద్దుటూరు.

సెల్: 9849226642.